సాక్షి ఒడిశా

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,25,347లు, బంగారం 8.7 గ్రాములు, వెండి 44 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



విన్నపాలు విన్నారు..

-8లో



శంఖారావానికి సంకేతంగా..

-8లో

న్యూస్‌రీల్

ఆర్.ఉదయగిరిలో గ్యాస్ గోడౌన్ ప్రారంభం



గ్యాస్ గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ చంద్రశేఖర సాహు

పర్లాకిమిడి: జిల్లాలోని ఆర్.ఉదయగిరి సమితిలో హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ భవనాన్ని ఎంపీ చంద్రశేఖరసాహు సోమవారం ప్రారంభించారు. వినియోగదారులకు సకాలంలో సేవలందించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేడీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్ నాయక్, ఉపాధ్యక్షుడు అంతర్యామి గమంగో, సురేష్ మాఝి, నాయకులు పాల్గొన్నారు.

'ప్రపంచ శాంతికి కృషి చేయాలి'



మాట్లాడుతున్న బ్రహ్మకుమారీలు మాల, మంజు

బరంపురం: మారుతున్న కాలానికి అనుగుణంగా అంతా ప్రపంచ శాంతికి కృషి చేయాలని రాజయోగిని బ్రహ్మకుమారి మాల కోరారు. నగరంలోని గిరి రోడ్డులోని ప్రజాపతి బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయ శాంతికుండం ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి, ఆరోగ్యం, ఆనందంపై సదస్సు సోమవారం నిర్వహించారు. రాజయోగిని బ్రహ్మకుమారి మంజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆధునిక, సాంకేతిక యుగంలో దేశాల మధ్య విద్వేషాలు, మనుషుల మధ్య పరస్పరం మనస్పర్థలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధమే దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. మానవ వినాశనానికి దారి తీసే అంతరాలకు అంతా స్వస్తి పలకాలని హితవు పలికారు. మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యానికి దోహదపడే యోగ సాధన వైపు అంతా అడుగు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజయోగి బీకే మృత్యుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

జీడితోట ఆక్రమణపై ఫిర్యాదు



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పర్లాకిమిడి: గుసాని సమితి శోబర పంచాయతీ గొడ తాలసింగి గ్రామంలో 38ఎకరాల జీడితోటను కొంతమంది అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకొని, ఇడ్కోల్ కంపెనీకి ధారాదత్తం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. దీనికి నిరసనగా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసనకు దిగారు. అనంతరం జిల్లా అదనపు మేజిస్ట్రేటు(రెవెన్యూ) భీరేంద్రకుమార్ దాస్‌కు వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా జీడితోటలపై వచ్చే ఆదాయంతో జీవిస్తున్నామని, కానీ భూమిని ఆక్రమించుకోవడంతో జీవనం కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బినోద్ పరిచ్చా, కాంతారావు రౌళొ, సీహెచ్ భాస్కర్, ప్రదీప్ ఆచారి, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కాంగ్రెస్ నాయకుల అభినందన




కలెక్టర్ లింగరాజ్ పండాను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పర్లాకిమిడి: జిల్లాలో మౌలిక సదుపాయాలు, బాల్య వివాహరహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో కలెక్టర్ లింగరాజ్ పండా న్యూఢిల్లీలో నీతి ఆయోగ్ నిర్వహించిన 16వ పౌరసేవా దినోత్సవంలో నీతిఆయోగ్ సీఈఓ బీవీ ఆర్.సుబ్రహ్మణ్యం, అదనపు కార్యదర్శి వి.రాధ, డిప్యూటీ రెసిడెంట్ లజిమా భట్టా తదితరుల మన్ననలు పొందారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బసంతపండా, మాజీ కౌన్సిలర్ అభిమన్యు పండా, దక్షిణ ఒడిశా ప్రహరి పూర్ణచంద్ర మహాపాత్రొ, ఎస్డీపీఓ రామకృష్ణపతి తదితరులు కలెక్టర్‌ను పుష్పగుచ్ఛాలతో సోమవారం అభినందించారు.

భద్రతకు పెద్దపీట!

- ఇకపై రాష్ట్రప్రభుత్వం నియంత్రణలోకి ప్రైవేట్ క్యాబ్ సర్వీసులు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర వాణిజ్య, రవాణాశాఖ
- ప్రయాణికుల సంక్షేమమే లక్ష్యంగా మార్గదర్శకాలు జారీ చేస్తున్నట్లు వెల్లడి



భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రైవేట్ క్యాబ్ సర్వీస్ ప్రొవైడర్ల కార్యాచరణ ప్రభుత్వ నియంత్రణలోకి రానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్ర వాణిజ్య, రవాణాశాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఒడిశా ఆన్-డిమాండ్ ట్రాన్స్‌పోర్టేషన్ టెక్నాలజీ అగ్రిగేటర్స్ గైడ్‌లైన్స్-2023 కార్యాచరణ కట్టుదిట్టం చేశారు. క్యాబ్ కంపెనీలు తమ వెబ్‌సైట్‌లు, యాప్‌లు, ఫోన్‌కాల్‌లో చేసిన ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా వినియోగదారులకు రవాణా సేవలను ఈ నిబంధనల పరిధిలో పరిగణించడం జరుగుతుందని తాజా ఉత్తర్వులు స్పష్టం చేశాయి. ఓలా, ఊబర్, ర్యాపిడో, ఇతర వర్గాలు నిబంధనల పరిధిలోకి వస్తాయి.

లైసెన్సు తప్పనిసరి..

వినియోగదారులకు సేవలు కల్పించేందుకు ఈ కంపెనీలు కనీసం రూ.50,000లు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. రుసుం చెల్లింపుతో ప్రభుత్వం లైసెన్స్ జారీ చేస్తుంది. సేవలు కల్పించేందుకు లైసెన్సు పొందడం అనివార్యం. 1,000 కంటే తక్కువ వాహనాలు ఉన్న క్యాబ్ సంస్థలు రూ.లక్ష, 1,000 కంటే ఎక్కువ క్యాబ్‌లు కలిగి ఉన్న సంస్థలు రూ.2 లక్షల 50 వేలు లైసెన్స్ రుసుంగా చెల్లించాలి. 5ఏళ్ల కాల పరిమితితో వీటిని జారీ చేస్తారు. తదుపరి రూ.25,000 చెల్లింపుతో పునరుద్ధరణకు వీలు కల్పిస్తారు.

భద్రత కవచం..

ప్రయాణికులు, క్యాబ్ డ్రైవర్ల భద్రత కవచంగా తాజా నిబంధనలు దోహదపడతాయి. ఈ వర్గాల భద్రత కోసం తరచూ పర్యవేక్షిస్తు సంస్కరణలు చేపట్టడం ప్రధాన లక్ష్యంగా విభాగం పేర్కొంది. లైసెన్స్ పొందేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కనీసం ఏడేళ్లు వాహన డ్రైవర్లు, యజమానులు దోషులుగా ఉండరాదని పేర్కొంది. అదేవిధంగా, మోసం, లైంగిక నేరాలు, దోపిడీ, హింసాత్మక ఘటనలలో దోషులుగా నిర్ధారన జరిగితే లైసెన్సు జారీ చేయరు. ఈ నేపథ్యంలో అనుబంధ వర్గాల వ్యతిరేకంగా కోర్టులో ఎలాంటి కేసులు పెండింగ్‌లో ఉండకూడదు. 2 సంవత్సరాల కాల పరిమితితో డ్రైవింగ్ లైసెన్స్, ఒడిశా డొమిసైల్ సరిఫికెట్ కలిగి ఉండాలి. ఈ వర్గాలకు ఒడియా భాషపై పరిజ్ఞానం తప్పనిసరి. వాహనాల్లో జీపీఎస్, ప్యానిక్ బటన్లు ఏర్పాటు తప్పనిసరిగా విభాగం స్పష్టం చేసింది.

ప్రయాణికుల సమగ్ర వివరాలు..

సర్వీస్ ప్రొవైడర్లు వాహనాలు తీసుకువెళ్లే పికప్, గమ్యస్థాన చిరునామాలు, ప్రయాణించిన దూరం, ఛార్జీల చెల్లింపులను తదితర ప్రయాణీకుల వివరాల రికార్డులు నిత్యం అందుబాటులో ఉంచాలి. ఈ రికార్డుల నిర్వహణ కనీస కాల పరిమితి ఒక ఏడాది. తద్వారా ప్రభుత్వం అవసరమైనప్పుడు వాటిని తనిఖీ చేస్తుంది. ప్రయాణికులు క్యాబ్ బుక్ చేసిన తర్వాత డ్రైవర్ ఫోటో, మొబైల్ నంబర్, వాహనం రిజిస్ట్రేషన్ సంఖ్య వినియోగదారుని సెల్‌ఫోన్‌కు ఆటోమేటిక్‌గా చేరే విధంగా సాంకేతిక వ్యవస్థ కార్యాచరణలో కొనసాగడం అనివార్యం.

పన్ను చెల్లించాల్సిందే..

క్యాబ్ కంపెనీలు ప్రతి కిలోమీటరుకు రూపాయి చొప్పున ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. అయితే ఈ-వాహనాలకు పన్ను మినహాయింపు కల్పించారు. వినియోగదారులకు సేవలు కల్పించే దిశలో కస్టమర్లకు విధించే ఛార్జీలు, వాహన యజమానులు, డ్రైవర్ల వాటాను రాష్ట్రప్రభుత్వం నిర్ణయిస్తుందని ఉత్తర్వులు స్పష్టం చేశాయి.

ఝార్సుగుడ బరిలో 9మంది

- పోటీ నుంచి మరొకరు విరమణ



భువనేశ్వర్: ఝార్సుగుడ నియోజకవర్గ ఉప ఎన్నిక పోటీకి అభ్యర్థులు ఖరారయ్యారు. నామినేషన్ల పరిశీలన, పోటీ ఉపసంహరణ ప్రక్రియ అనంతరం తుది అభ్యర్థుల జాబితా సోమవారం వెల్లడించారు. అంచెలంచెలుగా అభ్యర్థుల వివరాలను పరిశీలించిన ఎన్నికల సంఘం ఉప ఎన్నిక బరిలో చివరగా 9మంది అభ్యర్థులు మిగిలినట్లు ప్రకటించింది. తొలి దశలో ఈ నియోజకవర్గం నుంచి పోటీకి 14మంది నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలన దశలో నలుగురు అర్హత కోల్పోయారు. ఉప సంహరణ గడువు ముగిసే నాటికి ఒక అభ్యర్థి నుంచి పోటీ నుంచి వైదొలిగారు. మే 10న పోలింగ్ జరుగనుండగా, 13న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

బరిలో ఉన్న అభ్యర్థులు వీరే

అభ్యర్థి	పార్టీ
దీపాలి దాస్	బీజేడీ
టొంకొధొరొ త్రిపాఠి	బీజేపీ
తరుణ్ పాండే	కాంగ్రెస్
జన్మ రోహిదాస్	ఒడిశా ప్రగతి దళ్
మనీష్ శర్మ	ఒడిశా జనతా పార్టీ
మహేంద్ర పట్నాయక్	కళింగ సేన
బిజయ్ కుమార్ జలాన్	స్వతంత్ర అభ్యర్థి
మహేంద్ర లుహా	స్వతంత్ర అభ్యర్థి
జ్ఞానేంద్ర బెహరా	స్వతంత్ర అభ్యర్థి

నాయక్-సాహు జోడికి డబుల్స్ టైటిల్



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

- బహుమతులు అందించిన ఎమ్మెల్యే తారాప్రసాద్



ఆటగాళ్లు, విజేతలతో ఎమ్మెల్యే, నిర్వాహకులు

జయపురం: పట్టణానికి చెందిన డీపీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో డబుల్స్ విభాగంలో అమలామ్ గడనాయక్-తమ్మి సాహు జంట విజేతలుగా నిలిచారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సిద్ధార్థ నాయక్-మణికంఠ జట్టును ఓడించారు. ఈ సందర్భంగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. యువతలో ఆటలను ప్రోత్సహించడం ద్వారా కొరాపుట్ జిల్లాను క్రీడా రంగంలో అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ఆటలో గెలుపు, ఓటములు సహజమని, ఓటమి చెందిన వారు నిరాశకు గురి కాకుండా.. మరింతగా రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హిమాంశు మహాపాత్ర, ప్రసాద్ పట్నాయక్ సమక్షంలో సీనియర్ ఆటగాళ్లు త్రినాథ్ ఖడంగను సన్మానించారు. డీపీ అకాడమీ సభ్యులు నిమయ్‌చరణ దాస్, బాను దాస్, గౌరీ పట్నాయక్, దేవ దాస్, సుబ్రత పండా, ఆశిత్ పట్నాయక్, మోహనదొర తదితరులు పాల్గొన్నారు.

రూ.6 లక్షల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లా ఎక్సైజ్, సదర్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 78.250 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీమకిరణ్ బెక్, మొబైల్ టీం ఇన్‌స్పెక్టర్ హితాంశు శేఖర్ నాయక్, సదరు పోలీసులకు అందిన సమాచారం మేరకు పట్టణంలోని కొత్త బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో గంజాయి పట్టుబడింది. నిందితులను అరెస్ట్ చేయగా, రాజస్థాన్‌కు చెందిన వారిగా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న సరుకు విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులను సోమవారం ఉదయం కోర్టుకు తరలించారు.

కోత కాదు.. ఓవర్ లోడ్

- రాష్ట్రంలో కరెంట్ కోతలపై స్పందించిన విద్యుత్‌శాఖ మంత్రి ప్రతాప్ కేశరి



విలేకర్లతో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ మంత్రి ప్రతాప్ కేశరిదేవ్

భువనేశ్వర్:

అప్రకటిత విద్యుత్ కోతలపై విద్యుత్‌శాఖ మంత్రి ప్రతాప్‌కేశరి దేవ్ స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ కోత లేదని, ఓవర్ లోడ్ కారణంగా విద్యుత్ లైన్ ట్రిప్ అవుతోందని తెలిపారు. చాలా ప్రాంతాల్లో ఓవర్ లోడింగ్‌తో విద్యుత్ సరఫరా ట్రిప్ అవుతోందని, ప్రధానంగా భువనేశ్వర్ ప్రాంతంలో ఒకసారి లైన్ ట్రిప్ అయితే దాన్ని సరిచేయడానికి 6 నుంచి 7 గంటల సమయం పడుతోందని తెలిపారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో మరింత ఎక్కువ సమయం పడుతుందన్నారు. వినియోగదారుల సౌకర్యానికి నిరంతర విద్యుత్ సరఫరా కోసం విభాగం సాయశక్తులా ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. విద్యుత్ తీగలు తెగడం, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం వంటి ఫిర్యాదుల పట్ల సత్వర చర్యలకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో అనుబంధ వర్గాలతో ఇటీవల ముఖాముఖి సమావేశంలో పాల్గొని ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. సూటిగా చెప్పాలంటే, సాంకేతిక లోపాలతో లోఓల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. దూరం నుంచి విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ పై అధిక ఒత్తిడి లోఓల్టేజీ కారణాలుగా వివిరంచారు. అత్యధిక వినియోగ సమయంలో రాష్ట్రంలో సమగ్రంగా 5,600 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని, గత ఏడాది ఇది 5,500 మెగావాట్లకు పరిమితమైందని స్పష్టంచేశారు.

చందనం.. నయనానందం



నరేంద్ర పుష్కరిణిలో చందనయాత్ర శోభ



శ్రీమందిరం సింహద్వారం మీదుగా చందన యాత్రకు పల్లకిలో బయలుదేరిన దేవతా మూర్తులు

భువనేశ్వర్: జగన్నాథుని క్షేత్రం కళకళ లాడుతోంది. అక్షయ తృతీయ నుంచి ప్రారంభమైన చందన యాత్ర ఆనందోత్సాహాలతో కొనసాగుతోంది. ఈ యాత్ర తొలి దశ వెలుపలి చందనయాత్ర నరేంద్ర పుష్కరిణిలో జరుగుతుంది. నిత్యం సంధ్య వేళలో శ్రీమందిరం రత్నవేదిక నుంచి ఉత్సవ మూర్తులను పల్లకిలో పుష్కరిణి ప్రాంగణానికి ఊరేగింపుగా తరలిస్తున్నారు. సాయంత్రం చీకటి పడేంత వరకు నరేంద్ర పుష్కరిణి దేవతామూర్తుల ఆగమనంతో ప్రత్యేక కళ సంతరించుకుంటుంది. పుష్కరిణి తీరం భక్తులు, సందర్శకులతో కిటకిటలాడుతోంది. మరో 19 రోజుల పాటు స్వామి చందనయాత్ర నిరవధికంగా కొనసాగుతుంది. మరోవైపు శ్రీమందిరం సింహద్వారం ఆవరణలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రథ నిర్మాణ శాలలో రథాల తయారీ పనులు సోమవారం నుంచి ఊపందుకున్నాయి. ఆరంభ దశ తయారీ పనుల్లో మహరణ, భొయి సేవకులు చురుగ్గా పాల్గొంటున్నారు.

రైతన్నకు రాయితీ



లోక్‌సేవా భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటైన కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు



రైతులకు అభివాదం చేస్తున్న సీఎం నవీన్

- రూ.441.76 కోట్ల వడ్డీ రాయితీ విడుదల చేసిన సీఎం నవీన్ పట్నాయక్
- రాష్ట్రవ్యాప్తంగా 35లక్షల మంది రైతులకు లబ్ధి

భువనేశ్వర్: లోక్‌సేవా భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం జరిగిన సహకార శాఖ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్.. 2022-23 సంవత్సరానికి రూ.441.76 కోట్ల రెండో విడత వడ్డీ రాయితీ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా సహకార బ్యాంకులు, 2409 ప్రాథమిక బ్యాంకుల అధీనంలో 35లక్షల మందికి పైగా రైతులకు దీని ద్వారా లబ్ధి చేకూరనున్నట్లు తెలిపారు. తొలి విడత కింద రూ.415.17 కోట్ల వడ్డీ రాయితీ విడుదల చేశారు. మొత్తంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర రైతాంగం రూ.856.99 కోట్ల రాయితీని పొందారు. రైతులకు రూ.లక్ష వరకు సున్నా వడ్డీ రేటుతో పంట రుణాలు మంజూరవుతున్నాయి. 35 లక్షల మంది రైతుల్లో దాదాపు 30లక్షల మంది చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. ఈ సందర్భంగా హాజరైన రైతులు, వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న లబ్ధిదారులను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. ఒడిశా ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం ఆత్మ, అభివృద్ధికి ఆధారమన్నారు. నూతన ఒడిశా, బలమైన ఒడిశా రథ సారథులు రాష్ట్ర రైతాంగం, మహిళలు, యువతులుగా పేర్కొన్నారు. రైతుల సాధికారతకు నిరంతర ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. గంజాం జిల్లాలోని రైతులు పిల్లలు బరంపురం ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో చదువుకోవడానికి కాలియ పథకం కింద ఉపకార వేతనం అందుకున్నట్లు తెలిపారు. రైతులకు వడ్డీలేని రుణాలు, కాలియా వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తొలి రాష్ట్రం ఒడిశా కావడం విశేషంగా సీఎం నవీన్ పేర్కొన్నారు. వడ్డీ రాయితీ వల్ల అన్నదాతలు ఒక్క రూపాయి కూడా వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహకార ఉద్యమం మరింత బలపడిందని, పంట రుణాల్లో 60శాతం సహకార రంగం ద్వారానే అందజేస్తున్నామని తెలిపారు. రైతులే మనకు గర్వకారణమని, వారి నిరంతర కృషి, సంకల్పం వల్ల ఒడిశా వ్యవసాయ రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. రైతుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం నిరవధికంగా కృషి చేస్తుందని పునరుద్ఘాటించారు. రాష్ట్ర సహకారశాఖ మంత్రి అతున్ సబ్యసాచి నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తోందన్నారు. 'కృషి కర్మన్ అవార్డుకు అనేక సార్లు నామినేట్ కావడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా ఉదహరించారు. వ్యవసాయం, పారంపర్య ద్వారా తమ కుటుంబాల నిర్వహణలో వ్యవసాయ రుణాలపై వడ్డీ రాయితీ దోహద పడుతున్న వాస్తవ లబ్ధిని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముగ్గురు లబ్ధిదారులు రీనా సేథి, నికుంజ్ బిహారీ కాప్, సబితా సామంతరాయ్ వివరించారు. కార్యక్రమంలో సహకారశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజీవ్‌కుమార్ చద్దా, కో-ఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్ ఉద్ధబచంద్ర మాఝీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా, అభివృద్ధి కమిషనర్, అడిషనల్ చీఫ్ సెక్రటరీ అనూ గర్గ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి మహానగర్ మహోత్సవాలు


మాట్లాడుతున్న బీడీఏ చైర్మన్ సుభాష్

బరంపురం: ఈనెల 25(నేడు) నుంచి మే 5వరకు మహానగర్ మహోత్సవాలు జరగనున్నాయని బీడీఏ చైర్మన్ సుభాష్ మహరణ వెల్లడించారు. నగరంలోని ఖల్లికోట్ విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరగనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి గంజాం సంస్కృతి విభాగం ఆధ్వర్యంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గంజాం జిల్లాలో భాష, కళ, సంస్కృతుల పరిరక్షించుకునేందు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరగనునట్లు తెలిపారు. వీటితో పాటు వివిధ జిల్లాలకు చెందిన హస్త కళలకు చెందిన సుమారు 100కి పైగా స్టాల్స్ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యటన్ భారత్ నారాయణ మాంకుడ, జిల్లా సంస్కృతిక అధికారి రబి కుమార్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

బస్సు పునరుద్ధరించాలని డిమాండ్


కలెక్టరేట్ వద్ద కొయిపూర్ గ్రామస్తులు

పర్లాకిమిడి: జిల్లాలోని రాయఘడ–తుంబ రోడ్డులో గత కొన్నేళ్లుగా తిరుగుతున్న ప్రైవేటు బస్సును ఆర్టీఓ అధికారులు నిలుపుదల చేయడంపై కొయిపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చర్యల కారణంగా దాదాపు 20గ్రామాల ప్రజలు, విద్యార్థులు విద్య, వైద్యం, సమితి కార్యాలయానికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారని తెలిపారు. వెంటనే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని మాజీ సర్పంచ్ భాస్కర్ మండల్ స్పష్టంచేశారు. ఈ మేరకు జిల్లా అదనపు మేజిస్ట్రేటు బినోద్‌కుమార్ దాస్‌కు గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా అచ్చిబాబు

విజయనగరం ఫోర్ట్: కాంగ్రెస్ పార్టీ విజయనగరం జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడిగా చీమల అచ్చిబాబు నియమితులయ్యారు. ఈమేరకు పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సోమవారం నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు శాంతికుమారి, డీసీసీ అధ్యక్షుడు రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని వంజరాంపేట గ్రామంలో పదేళ్లుగా నివాసం ఉంటున్న బోని సూర్యారావు (65) అదృశ్యంపై సోమవారం కేసు నమోదుచేశామని ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపారు. ఈ నెల 20న ఇంట్లో ఎవరూలేని సమయంలో వృద్ధుడు ఎటో వెళ్లిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు గ్రామంతోపాటు చుట్టుపక్కల తెలిసినవారు, బంధువుల ఇళ్లల్లో వెతికారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడవంతో కుమారుడు దేవదాసు ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు. వృద్ధుడికి ఏడాదికాలంగా ఆరోగ్యంగా బాగాలేకపోవడంతోపాటు మతిస్థిమితం సరిగా లేక ఆస్పత్రిలో మందులు వాడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ కొద్దిరోజులుగా ఇబ్బందులు పడుతున్న మహిళ జీవితంపై విరక్తి చెంది ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు సోమవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బింగివీధిలో నివాసం ఉంటున్న కంటుభుక్త ప్రశాంతి (26) ఏడాది క్రితం ఇంట్లో జారిపడిపోయింది. అప్పటి నుంచి వెన్ను సమస్యతో పాటు పలు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో మానసికంగా కుంగిపోయింది. గడిచిన రెండురోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఇంటికి వచ్చిన ఆమె మనస్తాపం చెంది, ఆరోగ్య సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతుండడంతో చేసేది లేక ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త సేల్స్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఆ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు.

శంఖారావానికి సంకేతంగా..

- భువనేశ్వర్‌లో బీజేడీ ప్రధాన కార్యాలయంగా శంఖభవన్ ఏర్పాటు
- పార్టీ అధ్యక్షుడి హోదాలో ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్
- రాష్ట్ర సంస్కృతికి పెద్ద వేస్తున్నట్లు ప్రకటన
- బిజూ జనతాదళ్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం


బీజేడీ నూతన కార్యాలయ సముదాయం శంఖభవన్


శంఖభవన్‌ను ప్రారంభిస్తున్న బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: పవిత్ర అక్షయ తృతీయ పురస్కరించుకుని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్(బీజేడీ) ప్రధాన కార్యాలయ భవన సముదాయాన్ని శంఖభవన్‌ను ఆదివారం ప్రారంభించారు. పార్టీ ఆవిర్భావం సుమారు 25 ఏళ్ల అనంతరం అధునాతన సౌకర్యాలతో శంఖభవన్ సముదాయం ప్రారంభించడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం ప్రేరేపించింది. ఈ భవన సముదాయం నాలుగున్నర కోట్ల రాష్ట్ర ప్రజానీకానికి అంకితం చేసినట్లు బిజూ జనతాదళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ప్రకటించారు. శంఖభవన్ నుంచి ఒడిశా ప్రజలను ఉద్దేశించి సీఎం నవీన్ మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి, రాష్ట్ర రక్షణకు, నిర్మాణాత్మక కృషి సంకల్పబలం ఉన్న వారందరికీ శంఖభవన్ వేదిక అవుతుందని తెలిపారు. కొత్త, బలమైన ఒడిశాగా నాలుగున్నర కోట్లు పైబడిన ఒడియా ప్రజల ఇష్టమైన భవనంగా వెలుగొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. శంఖభవన్‌లోని అన్ని కార్యక్రమాలను ఒడిశా వాసుల సేవకే అంకితం చేస్తామని ప్రకటించారు.

1997.. నవశకం..

ఒడిశా రాజకీయాల్లో 1997 కొత్త శకానికి నాంది పలికిందని నవీన్ పట్నాయక్ గుర్తు చేశారు. బిజూ బాబు ఆదర్శాలు, పాత్ర, పోరాటం, సేవా దృక్పథంతో బిజూ జనతాదళ్ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. ప్రాంతీయ పార్టీగా ఒడిశా ప్రజలకు సేవలందించిన బీజేడీ ఇప్పుడు సామాజిక ఉద్యమంగా రూపాంతరం చెందిందన్నారు. 'విజయ శంఖారావం రాష్ట్రం అంతటా మార్మోగుతుంది. ఒడిశా గతంతో భవిష్యత్‌ను బీజేడీ అనుసంధాన పరుస్తుంది. ఇది రాష్ట్రంలోని నాలుగున్నర కోట్ల ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, ప్రజల రక్షణ, అభివృద్ధికి బీజేడీ సేవలు అంకితం చేస్తున్నాం. రాష్ట్ర కళ, సాహిత్యం, సంస్కృతి అభివృద్ధి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ పురోభివృద్ధికి స్ఫూర్తి కేంద్రంగా శంఖభవన్ పని చేస్తుంది. జగన్నాథ సంస్కృతిని మూలాధార సూత్రాల ఆధారంగా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించే కేంద్రంగా కూడా నిలుస్తుంద'ని పేర్కొన్నారు.

నిత్య రక్తదాన శిబిరం

జై జగన్నాథ్ అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్.. జగన్నాథుని గొప్ప సంస్కృతిని వ్యాప్తి చేసేందుకు శంఖభవన్ నిరంతరం కృషి చేస్తుందని, వసుదైక కుటుంబం సందేశాన్ని ప్రచారం చేస్తూనే ఉంటుందన్నారు. స్థిరత్వం బిజూ జనతాదళ్ విజయమంత్ర రహస్యంగా పేర్కొన్నారు. నీతి–నిజాయితీ ఆనందానికి, శాంతి శ్రేయస్సుకు ప్రేరణగా నిలిచి, బీజేడీ సుస్థిరత నిలకడగా కొనసాగుతుందని వివరించారు. శాంతియుత చైతన్యంతో రాష్ట్ర పరివర్తన ప్రక్రియ ఊపందుకుంటుందన్నారు. ఇదిలా ఉండగా.. ప్రతి వారం శంఖభవన్‌లో రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీనితో పాటు పేదల వివాహాలు, ఇతర సామాజిక కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తారు.

వీరగాథల ప్రతిబింబాలు..

ఉత్కళమణి గోపబంధు దాస్, ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్, కవి సరళాదాస్, వీర్ సురేంద్రసాయి, బక్షి జగబంధు, భీమ్ భోయ్, కవిసామ్రాట్ ఉపేంద్ర భంజ్, మహారాజా కృష్ణచంద్ర గజపతి, సాహిద్ లక్ష్మణ్ నాయక్, పండిట్ రఘునాథ్ ముర్ము, బిర్సాముండా వంటి సంఘ సంస్కర్తలు, ఉద్యమకారులు, ధరణిధర్ భుంయ్యా, మా రమాదేవి, పార్వతీ గిరి, ఫకీర్ మోహన్, గంగాధర్ మెహెర్, కుంతల కుమారి సాబత్, బాజీరౌత్ ఒడిశా వరపుత్రుల నిలువెత్తు చిత్రపటాలు శంఖభవన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ నిలువెత్తు ప్రతిమ త్వరలో ఏర్పాటు కానుంది. రాష్ట్రంలో 30జిల్లాల ప్రసిద్ధ వస్తువులు, ఉత్తమ కళాఖండాలు ఈ సముదాయంలో అలంకరిస్తారు.


సముదాయంలో ఆకర్షణీయమైన కార్యాలయ గది


జగన్నాథ సంస్కృతి ప్రచార ప్రాంగణం


శంఖ భవనంలో పరిమళ భరిత కేంద్రం

భక్తిశ్రద్ధలతో జయదేవుని జయంత్యుత్సవం


వేదికపై మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, ఏడీఎంలు

రాయగడ: గీతాగోవిందం సృష్టికర్త, విశ్వకవి జయదేవుని జయంతి ఉత్సవాలు జిల్లా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కృష్ణచంద్ర నగర్ భవనంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయగడ మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, గౌరవ అతిథులుగా జిల్లా అదనపు మేజిస్ట్రేట్లు ధర్మానంద బెహనా, సోమనాథ ప్రధాన్, సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఎండీ రాజేష్ పాఢి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహాకవి జయదేవుడు ఒడిశాకు చెందిన వ్యక్తి కావడం అందరికీ గర్వకారణమన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు అంతర్జాతీయ వేదికలపై నేటికీ జయదేవుని భక్తిగీతాలు ఆలపిస్తుండటం హర్షించదగ్గ విషయమని తెలిపారు. ఏడీఎం సోమనాథ ప్రధాన్ మాట్లాడుతూ జయదేవుడు రచించిన 10వేలకు పైగా కృతులు ఎంతోమందిని రంజింప జేస్తున్నాయన్నారు. 12వ శతాబ్దానికి చెందిన జయదేవుడు రచించిన కృతులు, గీతాలు మనకు అందుబాటులో ఉండటం విశేషమని పేర్కొన్నారు. ప్రధానంగా గీతాగోవిందం ఆయన రచనల్లో ఎంతో ప్రాముఖ్యత పొందిందన్నారు. పూరీ వంటి పుణ్యక్షేత్రంలో ఇప్పటికీ దేవదాసీలు నిత్యం జయదేవుని కృతులు ఆలపిస్తుంటారని గుర్తుచేశారు. అనంతరం జయదేవుడు రచించిన గీతాలను ప్రముఖ గాయని మధుస్మిత నాయక్ ఆలపించి, ప్రేక్షకులను రంజింపజేశారు. అదేవిధంగా పలువురు కళాకారులు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.


జయదేవుని గీతాలాపనలో మధుస్మిత


ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శనలు

దాసరివానిపాలెంలో చోరీ


బాధితులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ బాలసూర్యారావు

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం పంచాయతీ శివారు దాసరివానిపాలెం గ్రామంలో ఆదిమూలపు సుధీర్ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు చొరబడి ఐదున్నర తులాల బంగారం, రూ18వేలు నగదు దోచుకుపోయారు. బాధితుడు సుధీర్, సీఐ బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎప్పటిలాగానే రాత్రి భోజనాలు ముగించుకుని సుధీర్ కుటుంబ సభ్యులంతా ఇంట్లో నిద్రిస్తుండగా పక్క గదిలో కిటికీని గునపాంతో పెకిలించి దొంగ ఇంట్లోకి ప్రవేశించాడు. గదిలోగల క్రబీరువాలో ఐదున్నర తులాల బంగారం,రూ 18వేలు నగదు దోచుకుపోయాడు. సుధీర్ సోమవారం తెల్లవారు జామున లేచి చూసి బీరువా తెరిచి ఉండడం, వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించారు. గదికి ఉన్న కిటికీని గునపంతో పెలికించిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపించడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. దీంతో బాధితుడు సుధీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాత బొబ్బిలిలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన స్థల వివాదంలో సొంత అన్నపై తమ్ముడు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఉందంతంలో తీవ్ర గాయాలపాలైన అన్న గుణుపూరు కృష్ణ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇప్పటికే నిందితుడు గోపాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

ప్రశ్న పత్రాల్లో తప్పులు



- ఓఎస్ఎస్సీ ప్రిలిమ్స్ పరీక్ష రద్దు
- మరోసారి పరీక్ష నిర్వహించేందుకు సన్నాహాలు



ఓఎస్ఎస్సీ జారీ చేసిన తప్పులతో కూడిన ప్రశ్న పత్రం

భువనేశ్వర్: హౌసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ పరిధిలోని అకౌంటెంట్ పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేసినట్లు రాష్ట్రప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఒడియా భాష ప్రశ్నల ముద్రణలో తీవ్రమైన తప్పుల కారణంగా ఈ మేరకు నిర్ణయించినట్లు ఒడిశా స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఓఎస్ఎస్‌సి) ప్రకటించింది. ఒడియా భాషలో ప్రశ్నల ముద్రణలో తప్పులు దొర్లిన కారణంగా ఇంగ్లిష్, ఒడియా ఉభయ భాషలో ఆదివారం నిర్వహించిన అకౌంటెంట్ ప్రిలిమినరీ పరీక్షను కమిషన్ రద్దు చేసింది. ప్రిలిమినరీ పరీక్ష పునర్నిర్వహణకు తాజా తేదీ త్వరలో ప్రకటించనున్నట్లు ఒడిశా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తెలిపింది. అకౌంటెంట్ రిక్రూట్‌మెంట్ ప్రిలిమినరీ పరీక్షకు జారీ చేసిన ఒడియా మీడియం ప్రశ్న పత్రాల్లో తప్పులు దొర్లడంతో పరీక్షకు హాజరైన అభ్యర్థుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. దీనిపై ఒడియా భాషాభిమానుల వర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతిపక్ష భారతీయ జనతాపార్టీ దుమ్మెత్తి పోసింది. కమిషన్‌పై ఈ పరిస్థితులు అవాంఛనీయ ఒత్తిడి మోపాయి. సర్వత్రా విమర్శలు వ్యాపించడంతో లిఖిత పరీక్షను రద్దు చేసి మరోసారి నిర్వహించేందుకు నిర్ణయించినట్లు సోమవారం ప్రకటించడం అనివార్యమైంది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో జరిగిన పరీక్షకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారు. ఒడియా మాధ్యమ ప్రశ్నపత్రాల ముద్రణలో తప్పులు దొర్లడంతో ఒడియా భాషలో సెట్ చేయబడిన ప్రశ్నలను కనీసం చదివేందుకు వీలుకాని పరిస్థితి నెలకొంది. ప్రశ్న భావం అర్థం చేసుకోవడం పూర్తిగా అసాధ్యంగా పరిణమించిందని వీరంతా ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతిపాదనలకు ఆమోదం

భువనేశ్వర్:

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన సోమవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో 15 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. కేబినెట్ తీర్మానాల జాబితా.

- ఒడిశా ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ 2021 కింద సబ్సిడీ పెంపుదల.
- 76 పోస్టులను పెంచేందుకు ఒడిశా ఫారెస్ట్ సర్వీస్ గ్రూప్–బీ, గ్రూప్–ఏ(సీనియర్ బ్రాంచ్), (సూపర్ టైమ్ స్కేల్), (సుపీరియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్), (ఎస్ఎస్‌జీ) పునర్నిర్మాణం.
- ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ కార్యదర్శి మంజూరు పరిమితిని రూ.10 వేల నుంచి రూ.4 లక్షలకు పెంచేందుకు అనుకూలంగా ఒడిశా ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు నిబంధనల సవరణ–1956.
- ఆర్డినెన్స్ ప్రకటనతో వెనుకబడిన తరగతుల తాజా జాబితా జోడించేందుకు వెనుకబడిన తరగతులకు సంబంధించిన ఒడిశా కమిషన్(ఓఎస్‌సీబీసీ) చట్టం–1993 సవరణకు మంత్రిమండలి ఆమోదించింది.
- రెవెన్యూ, విపత్తు నిర్వహణ అధీనంలో కొనసాగుతున్న ఒడిశా రాష్ట్ర లఘు, ఖనిజాల నిర్వహణ ఉక్కు, గనుల శాఖకు బదిలీకి కేబినెట్ అంగీకారం.
- ఒడిశా స్పెసిఫైడ్ మైనర్ మినరల్స్ వేలం నియమాలు–2019 సవరణ ఆమోదం లభించింది.
- కటక్ రింగ్ రోడ్డును ఖాన్‌నగర్ నుంచి లింక్ రోడ్డు వరకు 6 లైన్ల స్టాండర్డ్‌గా మెరుగుపరిచే నిర్మాణ పనుల టెండర్ ఆర్‌కే డి.కన్‌స్ట్రక్షన్ సంస్థకు కేటాయింపు. ఈ ప్రాజెక్టు వ్యయ ప్రణాళిక రూ.121.65 కోట్లతో మంత్రిమండలి ఖరారు చేసింది.
- గ్రామీణ అభివృద్ధి విభాగం గ్రూప్–సీ, గ్రూప్–డీ ఉద్యోగుల కోసం ఒడిశా మినిస్టీరియల్ సర్వీసెస్(గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లా కార్యాలయాల రిక్రూట్‌మెంట్ విధానం, సేవల షరతులు) రూల్స్–2023 నియమావళి రూపకల్పనకు మంత్రి మండలి అంగీకారం.
- భారత జాతీయ హాకీ జట్లకు(పురుషులు మరియు మహిళలు) మరో 10 సంవత్సరాలు 2023 సంవత్సరం నుంచి 2033 సంవత్సరం వరకు ఒడిశా స్పాన్సర్ చేసేందుకు ఆమోదం.
- నాణ్యమైన విద్యుత్ సరఫరా, పంపిణీలో విశ్వసనీయత మెరుగుదలతో రవాణా పంపిణీ వృథా, నష్టం నివారణకు రూ.6,284 కోట్లతో ఆర్‌డీఎస్ఎస్ పథకంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,342 కోట్లుగా కేబినెట్ ప్రకటన.
- జనరల్ ప్రావిడెంట్ ఫండ్(ఒడిశా) రూల్స్–1938 సవరణకు కేబినెట్ నిర్ణయం.
- ఈపీఅండ్ఎం డైరెక్టరేట్‌లో నమోదైన రాష్ట్ర లఘు, సూక్ష్మ, మధ్య తరహా వ్యాపార సంస్థల రేట్ ఒప్పంద నియమాల సవరణకు ఆమోద ముద్ర.
- ఒడిశా ఎక్సైజ్ మినిస్టీరియల్ సర్వీసెస్(ఎక్సైజ్ డైరెక్టరేట్‌కు లోబడి ఉన్న జిల్లా కార్యాలయాల్లోని జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, సెక్షన్ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ విధానం, సర్వీస్ షరతులు) రూల్స్–2023 ఆమోదం.
- ప్రస్తుతం అమల్లో ఉన్న 'ఒడిశా సబార్డినేట్ ఎక్సైజ్ సర్వీస్(ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల రిక్రూట్‌మెంట్ విధానం, సర్వీస్ షరతులు) రూల్స్–2023 అమలు రద్దుకు కేబినెట్ ఆమోదం.
- బిజూ సేతుయోజన కింద 886 కొత్త వంతెనల నిర్మాణానికి ఆమోదం. కొనసాగుతున్న వంతెనల నిర్మాణం పూర్తి చేసేందుకు అదనంగా రూ.3597.22 కోట్లతో వ్యయ మంజూరుకు కేబినెట్ అంగీకారం.

విన్నపాలు విన్నారు..

- గ్రీవెన్స్ సెల్‌కు వినతుల వెల్లువ


శికులిపదర్‌లో ప్రజా సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్, అధికారులు

పర్లాకిమిడి: జిల్లాలోని మోహానా నియోజకవర్గం శికులిపదర్ పంచాయతీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కలెక్టర్ లింగరాజ్ పండా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీ వమదేవ్ సింగ్, ఐటీడీఏ పీఓ ఫాల్గుణి మార్బి, డీఆర్‌డీఏ పీడీ రమాంచల్ ఖమారి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. శికులిపదర్ పంచాయతీ పరిధిలోని చాందిపుట్, మేరాపల్లి, పిండిగి గ్రామాల నుంచి 119 అభియోగాలు అందాయి. వీటిలో వ్యక్తిగత వినతులు 34, గ్రామ సమస్యలపై 85 వచ్చాయి. 16 వినతులను కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కరించారు. నలుగురు నిస్సహాయులకు రూ.23 వేల చెక్కులను అందజేశారు. 23 మందికి మధుబాబు పింఛన్లు, నలుగురు దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. గ్రీవెన్సుకు మోహానా సమితి అభివృద్ధి అధికారి తపస్వినీ హంసదా, సిబ్బంది పాల్గొన్నారు.

జయపురంలో 38 ఫిర్యాదులు..

జయపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు 38 ఫిర్యాదులు అందాయి. జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తార్, ఎస్పీ అభినవ సోన్‌కార్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ గౌరవ శివాజీ ఇసల్‌వార్, జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణకుమార్ పాఢి, జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్ హాజరయ్యారు. ఫిర్యాదుల్లో 9 సామాజిక సమస్యలు, 29 వ్యక్తిగతమైనవిగా గుర్తించారు. వీటిలో భూమి వివాదాలు, తాగునీటి సమస్యలు, వైద్య సౌకర్యాలు, రహదారులు, ప్రయాణ సౌకర్యాలు, వితంతు పింఛన్లు, విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, జయపురం బాలికోన్నత పాఠశాలలో నాణ్యతలేని పనులు, జూనియర్ ఇంజినీర్లు, కంట్రాక్టర్లపై అవినీతి ఆరోపణలు, సేవా పేపరుమిల్లు బకాయిలు, పట్టణంలో హోర్డింగ్‌లు, మద్యం దుకాణాలు ఎత్తివేయాలని, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో అవినీతి ఆరోపణలపై ఫిర్యాదులు అందాయి. అలాగే ఎకంబాలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేసారు. గంగానగర్‌లో వరుస చోరీలు జరుగుతున్నా పోలీసులు సరైన రీతిలో స్పందించడం లేదని ఫిర్యాదు అందింది. దీనిపై స్పందించిన కలెక్టర్.. వెంటనే తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రమహంతి, సమగ్ర గిరిజనాభివృద్ధి జయపురం అధికారి గోపీనాథ్ సరక, బీడీఓ రాజీవదాస్, అదనపు సివిల్ సప్లై అధికారి సునీల్‌కుమార్ జెనా తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా


జయపురం: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ మహ్మద్ అక్తార్

క్లుప్తంగా

ఆదిత్యున్ని దర్శించుకున్న ప్రభుత్వ సలహాదారు



శ్రీకాంత్ దంపతులకు ఆదిత్యుని జ్ఞాపిక అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని దేవదాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరి సూర్యప్రకాష్, అర్చక బృందం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీకాంత్ ఆలయ ప్రాంగణంలో అన్నదానం, ప్రసాదాల విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఏఎస్సై కుటుంబానికి అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: కవిటి పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన డి.వి.భాస్కరరావు కుటుంబానికి జిల్లా పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పీ జి.ఆర్.రాధిక భరోసా ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి మంజూరైన విడోఫండ్, ఫ్లాగ్ ఫండ్ రూ. 75 వేల చెక్కులను మృతుని భార్య భారతికి సోమవారం అందజేశారు. కుటుంబ నేపథ్యం, పిల్లలు, చదువు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. రావాల్సిన మిగిలిన ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ పరిపాలనాధికారిణి శోభారాణి ఉన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్

పొందూరు: విధి నిర్వహణలో అలసత్వం తగదని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం, పొందూరు-1 సచివాలయాలను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో అనధికారికంగా వెలసిన బడ్డీని వెంటనే తొలగించాలని తహసీల్దార్ రాంబాబును ఆదేశించారు. మండలపరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ అక్కడే ఎందుకు విధులు నిర్వహిస్తున్నారని, కొత్త భవనంలోకి వెళ్లాలని సూచించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. పంచాయతీ, ఆర్‌బీకే భవనాల నిర్మాణాలు ఎందుకు పూర్తి చేయలేదని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. జగనన్న కాలనీల్లో ఎన్ని గృహాలు పూర్తి చేశారు, ఎన్ని పూర్తికావాల్సి ఉందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది విజిట్‌బుక్‌కు పరిశీలించగా.. అందులో వివరాలు నమోదు చేయకపోవడంతో వైద్యాధికారి, ఏఎన్‌ఎంలకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు.

అమ్మవారి ఉత్సవానికి రూ. 5 లక్షల విరాళం

పాతపట్నం: పాతపట్నంలో కొలువైన నీలమణిదుర్గ అమ్మవారి సంబరాలు వచ్చే నెల 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవం నిర్వహణ కోసం సామాజికవేత్త మామిడి గోవిందరావు ఐదు లక్షల రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఉత్సవ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు లింగాల ఉషారాణి, పైల లక్ష్మయ్య, కాళ్ల రాజు, లింగాల రవికుమార్, కొండాల యరకయ్య, శిర్ల జోగారావు ఉన్నారు.

రైలు ఢీకొని ఒడిశా యువకుడు మృతి

ఇచ్ఛాపురం రూరల్: రైలు ఢీకొని ఒడిశా ప్రాంతానికి చెందిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని సామంతపల్లి గ్రామానికి చెందిన నర్సు దేవ (30)ను సోమవారం ఉదయం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు లొద్దపుట్టి సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. దీంతో దేవ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పలాస జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎ.రమేష్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భారతో పాటు ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.

'గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలి'

- ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు



ఎచ్చెర్ల క్యాంపస్: సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు

శ్రీకాకుళం: గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు కోరారు. ఆయన సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, కమిషన్ సభ్యులతో కలసి జిల్లా అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో గిరిజనులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యవేక్షించి సంక్షేమ ఫలాలు గిరిజనులకు దక్కేలా కృషి చేస్తున్నామన్నారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే వాటిని సరిదిద్దుకుని ముందుకు సాగాలన్నారు. ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేశాకే జనరల్ రిక్రూట్‌మెంట్ చేపట్టాలని సూచించారు. సమగ్ర గిరిజన అభివృద్ధికి సీఎం ఎంతగానో కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగానే గిరిజనుల కోసం ప్రత్యేకంగా విశ్వవిద్యాలయం, వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఇంజినీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. జిల్లాలో గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్టీ సంఘాల నాయకులు, గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన మహిళలు మాట్లాడుతూ తమ సమస్యలను ఏకరువు పెట్టారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాలలో పీహెచ్‌సీలు 24గంటలు పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ తోపాటుగా సభ్యులు వడిత్యా శంకర్ నాయక్, కొర్ల రామలక్ష్మి, జేసీ ఎం.నవీన్, ఎస్పీ జి.రాధిక, ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఎస్ఇ ఇరిగేషన్ డోల తిరుమలరావు, డిఎస్‌వో రమణ, పలాస ఆర్‌డీఓ సీతారామ్, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, ఎస్టీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పక్కాగా రూల్ ఆఫ్ లా రిజర్వేషన్ అమలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉద్యోగ నియమకాలు, ఉన్నత విద్య ప్రవేశాల్లో ఎస్టీలకు పక్కాగా రూల్ ఆఫ్ లా రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని సోమవారం సందర్శించారు. ముందుగా వసతి గృహాలు, కళాశాలలు, ఇతర మౌలిక వసతులు పరిశీలించారు. అనంతరం పాలక మండలి సమావేశ మందిరంలో వర్సిటీ ప్రగతిపై వీసీ నిమ్మ వెంకటరావు పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం సెమినార్ హాల్లో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రస్తుత ప్రభుత్వం రాజ్యాంగ, జూడీషియల్ అధికారాలను కమిషన్‌కు కల్పించిందన్నారు. చట్టబద్ధంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, ఎస్టీల ప్రగతికి కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. అన్ని జిల్లాల కలెక్టరేట్లు, విశ్వవిద్యాలయాలు పరిశీలించి ఎస్టీల స్థితిగతులు తెలుసుకుంటున్నట్టు చెప్పారు. ఎస్టీలను అణగదొక్కే ప్రయత్నం చాలా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు చేశాయన్నారు. అయితే గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎస్టీల సంక్షేమానికి కృషిచేయగా.. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారి ప్రగతికి శక్తి వంచన లేకుండా పని చేస్తున్నారన్నారు. విద్య, ఉద్యోగ అవకాశాలను పూర్తిస్థాయిలో ఎస్టీలు ఉపయోగించుకోవడం ద్వారా ప్రగతి సాధించగలరన్నారు. బీఆర్‌ఏయూ వీసీ వెంకటరావు మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో ఎస్టీ విద్యార్థుల కోసం పక్కాగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక వసతి గృహం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. జగనన్న విద్య, వసతి దీవెనలను పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం పరిధిలో 119 అనుబంధ కళాశాలలు ఉన్నాయన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ బిడ్డిక అడ్డయ్య, కమిషన్ సభ్యులు రామలక్ష్మి, శంకరనాయక్ పాల్గొన్నారు.

వసతి సమస్య లేకుండా చర్యలు

- ట్రిపుల్ ఐటీ చాన్స్‌లర్ కేసీ రెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న చాన్సలర్ కేసీ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తికావాలని రాష్ట్ర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) చాన్సలర్ కేసీ రెడ్డి అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీని సోమవారం సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్నత వసతి గృహం, తరగతి గదులను ప్రీ యూనివర్సిటీ కోర్సు ప్రథమ సంవత్సరం ప్రవేశాల సమయానికి పూర్తిచేస్తే వసతి సమస్య ఉండదన్నారు. మంచినీరు, పరిశుభ్రత, రన్నింగ్ నీటి సౌకర్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భవిష్యత్తులో పారిశుద్ధ్యం, రన్నింగ్ నీటి సౌకర్య కల్పనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఆరు వేల మందికి వసతి గృహం, క్లాస్ వర్కు నిర్వహణ సామర్థ్యంపై దృష్టి పెడుతున్నట్టు చెప్పారు. త్వరలో ప్రీ యూనివర్సిటీ కోర్సు మొదటి ఏడాది ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ వస్తోందన్నారు. రాష్ట్రంలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ప్రకాశం క్యాంపస్‌లకు ఒకే అకడమిక్ క్యాలెండర్ అమలు చేస్తూ కరిక్యులమ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, పీవో మునిరామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్స్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ అధికారి ఆసిరినాయుడు, పీఆర్వో మామిడి షణ్ముఖ పాల్గొన్నారు.

'అందరి సహకారంతోనే ఉత్తమ ఫలితం'

టెక్కలి: 'స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు' విభాగంలో నందిగాం పంచాయతీ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీగా అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో.. సోమవారం విజయవాడలో పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి చేతుల మీదుగా సర్పంచ్ జడ్యాడ రమణమ్మ అవార్డు అందుకున్నారు. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా సుమారు రూ.4 లక్షల ఆదాయాన్ని పంచాయతీకు వచ్చే విధంగా పంచాయతీ యంత్రాంగం పనిచేయడం గమనించదగ్గ విషయం. వీటితో పాటు ఇంటి పన్నుల ద్వారా రూ.7 లక్షలు వసూలు చేశారు. పంచాయతీ పరిధిలో మంచినీటితో పాటు మౌలిక వసతుల కల్పనతో పాటు జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయడంపైనా దృష్టి సారించారు. దీంతో ఈ అవార్డు సాధ్యమైంది. పంచాయతీ పరిధిలో అందరి సహకారంతో నందిగాం, పెంటూరు, వేణుగోపాలపురం, కొండపేట, స్వామిపేట తదితర గ్రామాల్లో మరిన్ని మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా పాలన కొనసాగిస్తామని సర్పంచ్ జడ్యాడ రమణమ్మ వెల్లడించారు.

తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా చంద్రమోహన్



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడుగా పిసిని చంద్రమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా ఆకుల అప్పలసూరినాయుడు, సలహాదారులుగా వావిలపల్లి జగన్నాథంనాయుడు, సలహాదారులుగా సారికి వెంకటరావు (తెలంగాణ), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుర్గాషి విశ్వపతి (ఒడిశా), ఉపాధ్యక్షులుగా కూనిపల్లి శ్రీనివాసరావు (తెలంగాణ), ప్రధాన కార్యదర్శిలుగా తుమరాడ శ్రీనివాసరావు (తెలంగాణ), ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సలాన చిరంజీవి (ఏపీ), కరిమజ్జి దుర్గాసాయినాథ్ (తెలంగాణ), ఆధాడ ధనంజయ గంగాధర్ (ఏపీ) కార్యదర్శులుగా యలకల శ్రీనివాస్ (ఏపీ), పున్నాని కనకారావు (ఏపీ), సహాయకార్యదర్శులుగా కొరోతు రాధాక్రిష్ణ (తెలంగాణ), బుడితి అప్పలనాయుడు (ఏపీ), కోశాధికారిగా యలకల చంద్రరావు (ఏపీ), మీడియాసెల్ ప్రధాన కార్యదర్శిగా డోల అప్పన్న (ఏపీ), కార్యవర్గ సభ్యులుగా తుమరాడ వెంకటప్పన్న మణికంఠ రాజా (కర్ణాటక), శిడగం విజయ భాష్కరరావు (ఏపీ), లుకలాపు సింహాచలం (తెలంగాణ) ఎన్నికయ్యారు.

కిరణ్‌చంద్‌కు అశ్రునివాళి

సోంపేట: అవయవదానం చేసిన సోంపేట పట్టణానికి చెందిన విద్యార్థి మద్దిరెడ్డి కిరణ్‌చంద్‌కు స్నేహితులు, తోటివిద్యార్థులు, యువత, ప్రజా ప్రతినిధులు అశ్రునివాళులర్పించారు. సోమవారం ఉదయం పట్టణంలోని శ్మశానవాటికలో కిరణ్‌చంద్ అంత్యక్రియలను కుటుంబసభ్యులు నిర్వహించారు. ఉగ్యోగులు విద్యార్థి తల్లిదండ్రులను ఓదార్చారు. కుమారుడ్ని కోల్పోయిన బాధలో కూడా అవయవదానానికి తీసుకున్న నిర్ణయం స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. కాగా కిరణ్‌చంద్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ సోమవారం సాయంత్రం సోంపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.



సోంపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అధికారిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



రమణారావు (ఫైల్)



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

సారవకోట: గుమ్మపాడు పంచాయతీ అక్కివలస గ్రామానికి చెందిన బీఎస్‌ఎఫ్ ఏఎస్సై (జవాన్) హనుమంతు రమణారావు (55) త్రిపురలో విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో శనివారం మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామం అక్కివలస గ్రామానికి సోమవారం తీసుకొచ్చారు. మృతదేహంపై జాతీయ జెండాను ఉంచి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ సూచికగా పోలీసులు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. అంత్యక్రియల్లో స్థానిక పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. మృతునికి భార్య కుమారమ్మ, కుమారుడు సతీష్‌కుమార్, కుమార్తె చాందినిలున్నారు. తహసీల్దార్ ప్రవల్లికాప్రియ జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కొత్త ఆవిష్కరణలు రావాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం రూరల్: వ్యవసాయంలో పంటల ఉత్పాదకతను పెంచే కొత్త ఆవిష్కరణలు రావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉత్తర కోస్తా మండల వ్యవసాయ పరిశోధన-విస్తరణ సలహా మండలి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు ఆధునిక పద్ధతుల వైపు మళ్లాలని సూచించారు. చైనాతో పోలిస్తే దేశంలో వరి ఉత్పాదకత సగం మాత్రమే ఉందని, అదే ఎరువుల వినియోగం పరిశీలిస్తే రెట్టింపు ఉందని చెప్పారు. వరి నుంచి ఇథనాల్, చెరుకు ఉంచి మొలాసిస్ ఉత్పత్తుల మాదిరి ఇతర పంటల్లోనూ ఆ రకమైన ప్రత్యామ్నాయ ఫలితాలు రాబట్టేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలని సూచించారు. ఎన్జీఆర్‌ఏయూ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.ప్రశాంతి మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ వల్ల సాగు ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డాక్టర్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాల ఉత్పతికి సంబంధించి రైతులు మెలకువలు తెలుసుకోవాలని చెప్పారు. వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్ సాగులో కీలక అంశాలను వివరించడంతో పాటు ఉత్తర కోస్తా జిల్లాలకు అనువైన రకాలపై కూలంకుషంగా విశదీకరించారు. అంతకుముందు సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై రూపొందించిన కరపత్రాలను కలెక్టర్, అతిథులు ఆవిష్కరించారు. సమావేశంలో డా. పివికె జగన్నాథరావు, డాక్టర్ నేతాజీ, పత్తి ప్రధాన శాస్త్రవేత్త శ్రీలక్ష్మి, కలుపు శాస్త్రవేత సుబ్రహ్మణ్యం శ్రీకాకుళం, విజయనగరం జెడిలు శ్రీధర్, వి.టి రామారావు, అనకాపల్లి ఏడీ రామారావు ఎంవీ రమణ పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ పాలకులుగా గర్వపడాలి



జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌లతో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్ తదితరులు

- జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

అరసవల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో స్థానిక పాలన అద్భుతంగా జరుగుతోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకుముందు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్, జెడ్పీ సీఈఓ వెంకట్‌రామన్‌లతో కలిసి ఆమె గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గాంధీజీ కలలు గన్న స్వరాజ్యం జగనన్న రాజ్యంలోనే సాధ్యమైందని, అందుకే ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అత్యంత మెజార్టీతో పాటు జిల్లా చరిత్రలో తొలిసారిగా అత్యధిక శాతం గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్ ప్రాదేశికాల స్థానాలను ఇచ్చారని గుర్తు చేశారు. పంచాయతీరాజ్ పాలకులు గర్వపడాలని అన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ పరిపాలనలో గ్రామ పంచాయతీలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ పార్లమెంట్‌లో 73వ రాజ్యాంగ సవరణ అమలు జరిగిన కారణంగా ఈ రోజున పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, జిల్లాలో అన్ని పంచాయతీల్లోనూ అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జరుగుతున్నాయని వివరించారు.

ఈ సారి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం తొమ్మిది అంశాల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రగతి పొందిన తొమ్మిది పంచాయతీలకు అవార్డులను ప్రకటించింది. అయితే విజయనగరం జిల్లా పరిధిలోకి వెళ్లిన కొప్పరవలస (వంగర), మన్యం పార్వతీపురం పరిధిలోకి వెళ్లిన వెలగవాడ (పాలకొండ) పంచాయతీల సర్పంచ్‌లు మినహా మిగిలిన ఏడుగురు పంచాయతీల సర్పంచ్, కార్యదర్శులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయతో కలిసి ఆయన సత్కరించారు. జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన బాలసీమ పంచాయతీ (సర్పంచ్ ఆరంగి జ్యోత్స్న, కార్యదర్శి షర్మిళ), పడ్డ పంచాయతీ (సర్పంచ్ మజ్జి రామచంద్ర, కార్యదర్శి అప్పారావు), ఎత్తురాళ్లపాడు పంచాయతీ (సర్పంచ్ తలగాన గణపతిరావు, కార్యదర్శి రవిశంకర్), చెల్లాయివలస పంచాయతీ(సర్పంచ్ చింతు జగ్గునాయుడు, కార్యదర్శి రమేష్), వమరవిల్లి పంచాయతీ (సర్పంచ్ సుగ్గు లక్ష్మీభాయి, కార్యదర్శి బమ్మిడి వెంకటసత్యం), దంత పంచాయతీ(సర్పంచ్ గొండు చాందిని, కార్యదర్శి ఆర్.నరేష్), బూరగాం పంచాయతీ(సర్పంచ్ బొడ్డు రాజేశ్వరి, కార్యదర్శి సాల్మన్) లను ఘనంగా సత్కరించారు.

జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీలు ఇవే..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని 38 మండలాల్లో పలు విభాగాల్లో అత్యుత్తమ ప్రగతి కనబరిచిన గ్రామ పంచాయతీలకు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులు వరించాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో ఉత్తమ పంచాయతీ అవార్డును టెక్కలి నియోజకవర్గం నందిగాం పంచాయతీ దక్కించుకోగా... జిల్లా స్థాయిలో 9 గ్రామ పంచాయతీలకు 9 విభాగాల్లో ఉత్తమ అవార్డులు దక్కాయి.

- కంచిలి మండలం - బూరగాం పంచాయతీ (పేదరిక నిర్మూలన- ఉపాధి అవకాశాల కల్పన)
- కోటబొమ్మాళి మండలం - దంత పంచాయతీ (హెల్దీ పంచాయతీ)
- గార మండలం - వమరవల్లి పంచాయతీ (చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ)
- పాలకొండ మండలం వెలగవాడ పంచాయతీ (వాటర్ సఫీషియంట్ పంచాయతీ)
- పోలాకి మండలం - చెల్లాయవలస పంచాయతీ (క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ)
- కోటబొమ్మాళి మండలం - ఎత్తురాళ్లపాడు పంచాయతీ (సెల్ఫ్ సఫీషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీ)
- వంగర మండలం - కొప్పరవలస పంచాయతీ (సోషియల్లీ సెక్యూర్డ్ పంచాయతీ)
- మెళియాపుట్టి మండలం - పడ్డ పంచాయతీ (పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్)
- నరసన్నపేట మండలం- బాలసీమ పంచాయతీ (ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ)

సమ్మర్ 'పవర్'



- జిల్లాలో డిమాండ్‌కు మించిన విద్యుత్ వినియోగం
- మార్చి నుంచే పీక్ టైమ్ మొదలు
- వేసవికి ప్రత్యేక చర్యలు చేపడుతున్న విద్యుత్ శాఖ

అరసవల్లి: ఫ్యాను ఆగడం లేదు. టీవీ ఆఫ్ చేయడం లేదు. లైటు ఆపడం లేదు... కలగలిపి కరెంటు వినియోగం భారీగా పెరిగింది. గతంలో ఏప్రిల్, మే, జూన్ నెలలకే పరిమితమైన ఈ 'పీక్' టైమ్ ఓ నెల ముందే వచ్చేసింది. మార్చి నెల నుంచే జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. జిల్లా విద్యుత్ శాఖ అధికారిక లెక్కల ప్రకారం చూస్తే డిమాండ్ కంటే ఎక్కువగా విద్యుత్ వినియోగం కనిపిస్తోంది. జిల్లాలో ప్రస్తుతం అన్ని కేటగిరీల విద్యుత్ కనెక్షన్లు సుమారు 9.20 లక్షలకు పైగానే ఉన్నాయి. గతం వరకు రోజుకు జిల్లాలో విద్యుత్ వినియోగం చూస్తే సగటున 40 లక్షల 50 వేల యూనిట్లు ఉండేది. ఇప్పుడు వినియోగం ఏకంగా 60 లక్షలకు పైగా యూనిట్లకు చేరుకుంటోంది.

ఏసీలు పెరిగాయి..



జిల్లాలో ఏసీల వినియోగం గతంలో కంటే ఎక్కువగా పెరిగిందని అధికారులు గుర్తించారు. దీని వల్లే కరెంటు బాగా కాలుతోందని అంటున్నారు. అలాగే పీక్‌లోడ్ సమయాల్లోనే అంతా ఒకేసారి విద్యుత్‌ను వినియోగించడంతో కూడా లోడ్ బ్యాలెన్సింగ్ సమస్య పలు ఫీడర్లలో కనిపిస్తోంది. డిస్కం పరిధిలో శ్రీకాకుళం సర్కిల్ పరిధిలో శ్రీకాకుళం, పాలకొండ, టెక్కలి డివిజన్లలో విద్యుత్‌ను తెగ వాడేస్తున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇలాగే విద్యుత్‌ను అవసరానికి కాకుండా అనవసరంగా వాడేస్తే రానున్న రోజుల్లో ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరిట విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడే ప్రమాదముందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వేసవి ప్రత్యేక చర్యలివే..

- జిల్లాలో వేసవి కాలం డిమాండ్, సరఫరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎల్.దైవప్రసాద్ ఆధ్వర్యంలో ఆయా డివిజన్ల ఈఈల పర్యవేక్షణలో పలు ప్రాంతాల్లో వినియోగ స్థాయిని బట్టి లోడ్ బ్యాలెన్సింగ్ పనులు చేపడుతోంది.
- జిల్లాలో అధిక విద్యుత్ వినియోగం (ఓవర్ లోడ్) కలిగిన ఫీడర్లు గుర్తించి సమీపంలో ఉండే వేరే ఫీడర్లకు బదలాయిస్తున్నారు.
- లోడ్ బ్యాలెన్సింగ్ కోసం కొత్త ఫీడర్లు, లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.
- లోడ్ బ్యాలెన్సింగ్ కోసం అధిక వినియోగం ఉన్న లావేరు మండలం 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.
- పలాసలో 31.5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.
- జిల్లాలో ఈ ఏడాది మార్చిలో 181, ఏప్రిల్‌లో ఇప్పటివరకు 213 విద్యుత్ నియంత్రికలు (డిటిఆర్), లోడ్ బ్యాలెన్స్‌తో పాటు నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు చేపట్టారు.
- ఏసీల వినియోగం భారీగా పెరిగిపోవడంతో విద్యుత్ డిమాండ్ కంటే వినియోగం 30-40 శాతం పెరిగినట్లుగా అంచనాలున్నాయి.
- ఏసీలకు 24 డిగ్రీల్లో పెట్టుకుని వినియోగిస్తే బిల్లు తక్కువగా వచ్చే అవకాశాలుంటాయి.

స్వీయ నియంత్రణ పాటించాలి




వేసవి నేపథ్యంలో జిల్లాలో సర్కిల్ పరిధిలోని లోడ్ అధికంగా ఉండే ప్రాంతాలు గుర్తించాం. ఇప్పటికే లోడ్ బ్యాలెన్సింగ్ చేసేలా చర్యలు మొదలుపెట్టాం. ఇంకా ప్రస్తుతానికి డిమాండ్ కంటే వినియోగం అధికంగా ఉంది. అనవసరంగా విద్యుత్‌ను వినియోగించకుండా వినియోగదారులు స్వీయ నియంత్రణ పాటించాలి. అప్పుడే విద్యుత్ ఆదాతో పాటు మరింత ఉత్పత్తికి దోహదపడుతుంది. ముఖ్యంగా ఏసీల వినియోగం భారీగా పెరిగిపోవడంతో అధికంగా విద్యుత్ వినియోగం జరుగుతోంది. వినియోగదారులే తమకు తాము ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అవసరమైన విద్యుత్‌ను వాడుకుంటే మంచిది. సోలార్ ఉత్పత్తులు, ఎల్‌ఈడీలను వినియోగిస్తే బిల్లులు తగ్గుతాయి.

– ఎల్.దైవప్రసాద్, ఎస్‌ఈ

విద్యుత్‌ను ఆదా చేయండిలా..

- అవసరం లేని సమయాల్లో విద్యుత్ ఉపకరణాల స్విచ్‌లను ఆపివేయాలి.
- విద్యుత్ లోడ్ ఎక్కువున్న సమయాల్లో అంటే ఉదయం 6 నుంచి 9, సాయంత్రం 6 నుంచి 10 వరకు అత్యవసర పనులకు మాత్రమే విద్యుత్‌ను వినియోగించాలి. దీనివల్ల నాణ్యమైన విద్యుత్ అందరికీ సరఫరా జరిగే అవకాశముంటుంది.
- సహజంగా విద్యుత్ వినియోగదారులు వాడే విద్యుత్ బిల్లుల్లో 30-40 శాతం ఫ్యాన్లకు, 15 శాతం ఫ్రిజ్‌కు, 10-20 శాతం విద్యుత్ లైట్లకు, మిగిలినవి టీవీ, కంప్యూటర్ లాంటివి వినియోగంతో బిల్లుల రూపంలో వస్తున్నాయి.



- 5 స్టార్ గృహోపకరణాలను, ఎల్‌ఈడీలను, వినియోగించడంతో విద్యుత్ బిల్లు తగ్గే అవకాశాలున్నాయి.
- కరెంట్‌తో పనిచేసే వాటర్ హీటర్లు, గీజర్లు కంటే సోలార్‌తో పనిచేసే వాటర్ హీటర్లను వాడితే మేలు.